క్లుప్తంగా

వివరాలు వెల్లడించాలి

కొణిజర్ల: నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పరిధిలో గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కోసం లబ్ధిదారులు బిల్లు రసీదు తీయడానికి వచ్చే సిబ్బందికి ప్రజాపాలన దరఖాస్తు రసీదు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు చూపించి నమోదు చేయించుకోవాలని పెద్ద గోపతి ఏడీఈ తిలక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ సిబ్బంది వచ్చిన సమయంలో ఇంటి వద్ద లేని వారు సమీపంలోని సబ్‌స్టేషన్‌లో సంబంధిత పత్రాలు చూపించి వివరాలు ధృవీకరించుకోవాలన్నారు.

ఎస్సెస్సీలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ప్రత్యేకాధికారి విజయ్

ఏన్కూరు: పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఐటీడీఏ ప్రత్యేకాధికారి విజయ్ కోరారు. మండలంలోని మూలపోచారం ఆశ్రమ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ'కి 2,659 దరఖాస్తులు

తల్లాడ: ఎమ్మెల్సీ ఓటు కోసం తల్లాడ మండలంలో గురువారం నాటికి 2,659 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు తల్లాడ తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. గతంలో కంటే ఈ ఏడాది ఎమ్మెల్సీ పట్ట భద్రులు పెరిగాయని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు పంపినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

గొర్రెల పంపిణీ చేపట్టాలి

పెనుబల్లి: గొర్రెల పంపిణీ పథకంలో బి లిస్ట్ ఉన్న అందరి గొర్రెల పంపిణీ వెంటనే చేపట్టాలని గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. జిల్లాలో 11 వేల మంది, యాదవ, కురుమలు గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా రూ.43,750 చొప్పున రూ.48 కోట్లు12 లక్షల 50 వేలు డీడీ చెల్లించి బీఆర్ఎస్ ప్రభుత్వంలో 18 నెలల ఎదురు చూశారని అన్నారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం గొర్రెల పంపిణీ వెంటనే చేపట్టి ఆదుకోవాలని కోరారు.

విజయవంతం చేయండి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ తఫజల్ హుస్సేన్

కొణిజర్ల: ఈ నెల 12న నిర్వహించే నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 1 నుంచి 19 ఏళ్ల వయసు కలిగిన ప్రతి ఒక్కరికీ నులి పురుగుల నివారణ మాత్రలు తినిపించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ తఫజల్ హుస్సేన్ తెలిపారు. గురువారం స్థానిక తహసీల్‌లో వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్ మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు జూనియర్ కళాశాలల్లో ఈ మాత్రలు తప్పనిసరిగా మింగించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రామకృష్ణ, రమేష్, పీహెచ్‌సీ సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నేత్రదానం



రామిశెట్టి సుబ్బారావు

సత్తుపల్లిటౌన్: పట్టణానికి చెందిన ప్రియాంక ప్రింటింగ్ ప్రెస్ యజమాని రామిశెట్టి సుబ్బారావు (60) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుబ్బారావు నేత్రాలను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సేకరించి ఖమ్మం నేత్ర నిధికి పంపించారు. ఈ సందర్భంగా ఆయన భౌతికకాయాన్ని పలువురు పట్టణ ప్రముఖులు సందర్శించి నివాళులు అర్పించారు.

అల్పాహారానికి నగదు అందజేత

ముదిగొండ: మండలంలోని పెద్దమండవ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం అందజేయటం కోసం గ్రామానికి చెందిన మన్నెం కోటయ్య రూ.8వేలు నగదును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తంగతుర్తి సుబ్బారావుకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వెంగళరావు, ఉపాధ్యాయులు కొండపల్లి రవి, నక్షత్రమణి, మిరావలి, వీరన్న, పద్మశ్రీ, శ్రీలక్ష్మి, సరస్వతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన



కొణిజర్ల: యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న కార్యదర్శి, అంగన్‌వాడీలు



ముదిగొండలో గ్యాస్ కనెక్షన్ల వివరాలను ఫోన్‌యాప్‌లో పరిశీలిస్తున్న ఆర్డీఓ గణేష్

కొణిజర్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా గృహజ్యోతి పథకం కింద రూ.500కే గ్యాస్ సిలెండర్ పథకం లబ్ధిదారులను గుర్తించే క్రమంలో గురువారం నుంచి గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఈఓలు ఇంటింటి పరిశీలన ప్రారంభించారు. దీనికి పలువురు లబ్ధిదారులు ప్రజాపాలనలో వారి పత్రాలతో తప్పుడు సమాచరం ఇవ్వడంతో.. కార్యదర్శులు ఇంటింటికీ తిరిగి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. మండలంలోని 19వేలకు పైగా దరఖాస్తులు రాగా.. వాటిలో 6476 మంది తప్పుడు నంబర్లు ఇవ్వడంతో వారి వివరాలు తిరిగి యాప్‌లో ఈ నమోదు ప్రక్రియ తర్వాత గృహజ్యోతి పథకానికి అర్హుల జాబితా సిద్ధం చేయనున్నట్లు ఎంపీడీఓ కె.మహాలక్ష్మి, ఎంపీఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మూడు రోజులలో ఈ ప్రక్రియ పూర్తి అవుతుందని, దీనికై పంచాయతీ కార్యదర్శులతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐకేపీ సీసీ లను ఉపయోగించుకుంటున్నట్లు తెలిపారు. ఒకొక్కరు రోజుకు 120 చొప్పున యాప్‌లో నిక్షిప్తం చేయాలని నిర్దేశించినట్లు తెలిపారు.

గ్యాస్ కనెక్షన్ల పరిశీలన..

ముదిగొండ: ముదిగొండ ఎస్సీ కాలనీలో గ్యాస్ కనెక్షన్ల వివరాలను యాప్‌ద్వారా ఖమ్మం ఆర్డీఓ గణేష్ గురువారం పరిశీలించారు. తెలంగాణ ప్రభుత్వం రూ.500లకు ఇచ్చే సరఫరా పథకంలో భాగంగా ముదిగొండ మండలంలోని 7,770 ప్రజాపాలన దరఖాస్తులలో గ్యాస్ కనెక్షన్ నంబర్, గ్యాస్ ఏజెన్సీ పేరు తప్పుగా నమోదు చేసిన వారిని గుర్తించి సరిచేయాలని ఆర్డీఓ సిబ్బందికి సూచించారు. ముదిగొండ ఎస్సీ కాలనీలో జరిగే కార్యక్రమాని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎంపీఓ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



పరిసరాలను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

ఏన్కూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీపీ అరెం వరలక్ష్మి కోరారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య వారోత్సవాలలో గురువారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 14 వరకు పారిశుద్ధ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రెయినేజీలో పూడిక తీత పనులు, తాగునీటిని క్లోరినేషన్, దోమల మందు పిచికారి చేయడం తదితర పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుమాధవ్, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేంసూరు మండలంలో..

వేంసూరు: మండలంలోని 26 గ్రామ పంచాయితీల్లో బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారులు అంతర్గత రహదారుల వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, పంచాయితీల్లో సైడ్ డ్రెయిన్లలోని పూడిక తొలగించారు. ఆయా పంచాయతీ ప్రత్యేక అధికారులు తహసీల్దార్ ఎంఏ రాజు, ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ రంజిత్‌కుమార్, ఏఓ రామ్మోహన్, ఎంఈఓ సీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన డీఐఈఓ



మాట్లాడుతున్న డీఐఈఓ రవిబాబు

వైరా: వైరాలోని క్రాంతి జూనియర్ కళాశాలలో జరగుతున్న ప్రాక్టికల్ పరీక్షలను డీఐఈఓ రవిబాబు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులతో మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ నెల 19న నిర్వహించే ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ పరీక్ష తప్పని సరిగా రాయాలన్నారు. థియరీ రికార్డుకు 40 మార్కులు కేటాయించడం జరిగిందని, దీనిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పరీక్షల నిర్వహణపై అధ్యాపకులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్, డీఓ జోజి రెడ్డి, హెచ్.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు కృష్ణారావు, లింగారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న మల్లు నందిని

మధిర: ఖాజీపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమని పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యం కోరినట్లు ప్రభుత్వం తరపున మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ముందుగా ఆమెకు కళాశాల అధ్యాపక సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నాగరత్తమ్మ సేవలు మరువలేనివి..

మధిరరూరల్: ఆత్కూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు దారా నాగరత్తమ్మ అనారోగ్యంతో బాధపడుతుగురువారం మృతి చెందింది. ఆమె మతదేహాన్ని మల్లు నందిని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాగరత్తమ సేవలు మరువలేనివన్నారు. బాలరాజు కుటుంబానికి సంతాపం తెలిపిన వారిలో ప్రముఖ వైద్యుడు వాసిరెడ్డి రామనాథం, మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత, కౌన్సిలర్ మల్లాది వాసు, భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి, జవ్వాజి ఆనందరావు ఉన్నారు.

సాగర్ జలాలతో చెరువులు నింపాలి



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా: ఖమ్మం జిల్లాలో సాగర్ ప్రధాన కాల్వ ఆయకట్టు పరిధిలో పంటలకు సాగునీరు అందించడానికి సమీపంలోని చెరువులు కుంటలు సాగర్ జలాలలో నింపాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు కోరారు. గురువారం వైరాలోని బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో జరిగిన సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ.. పాలేరు పాత కాల్వ కింద 7 వేల ఎకరాలలో వరి సాగుతో పాటు జిల్లాలో సాగర్ ఆయకట్టు కింద మిర్చి, మొక్కజొన్న పంటలు సాగు నీరు లేక ఎండి పోతున్నాయన్నారు. పశువులకు కూడా తాగు నీరు లేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సాగర్ జలాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట నాగేశ్వరరావు, బాణాల శ్రీనివాసరావు, కిలారు శ్రీనివాసరావు, మేడా శరాబంది, తూము సుధాకర్, సామినేని బాబు, అనుమోలు రామారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు



బోరుకు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

చింతకాని: మండలంలోని నేరడ గ్రామంలో తాగునీటి బోరుకు గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి రమేష్, ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గురువారం మరమ్మతులు చేపట్టారు. గ్రామంలో మంచినీటి ట్యాంక్ దగ్గర ఉన్న బోరు గత కొంత కాలంగా పనిచేయక గ్రామప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని బోరుకు మరమ్మతు చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మురళి, దూసరి గోపాలరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో బోర్‌వెల్..

కారేపల్లి: కారేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తాగునీటి కోసం రోగులు, వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రామస్తులు, వైద్య సిబ్బంది ఇటీవల వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ దృష్టికి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. కాగా.. గురువారం కారేపల్లి పీహెచ్‌సీలో బోరు వేయించి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. దీనికి సంబంధించి కారేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సురేష్, వైద్యసిబ్బంది ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సెల్ మండల అధ్యక్షుడు టోనీవీరప్రతాప్ పాల్గొన్నారు.

సన్మానం

కారేపల్లి: మండలంలోని పాతకమలాపురం గ్రామ పంచాయతీ పాలక వర్గాన్ని గ్రామస్తులు, అధికారులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గుగులోత్ పద్మామంగ్యా, ఉప సర్పంచ్ రమేష్, వార్డు సభ్యుడు వెంకటేశ్వర్లును శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రోజా, పశువైద్యాధికారి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సమావేశం

ముదిగొండ: ముదిగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఈ నెల 12న నులిపురుగుల నివారణకు ఆల్బెండజోలు మాత్రల పంపిణీ కార్యక్రమంపై మండల టాస్క్‌ఫోర్స్ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో ముదిగొండ, వల్లబి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ అరుణాదేవి, డాక్టర్ ధర్మేందర్, ఎంఈఓ రామాచారి, సీడీపీఓ కమలప్రియ, సీహెచ్ఓ దుర్గామల్లేశ్వరి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మిస్ట్ కళాశాలలో ఈసీఈ విద్యార్థులకు వర్క్‌షాప్

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఈసీఈ విభాగం ఆధ్వర్యాన ఫండమెంటల్స్‌అండ్ అప్లికేషన్ ఆఫ్ మ్యాట్‌ల్యాబ్‌పై మూడురోజుల వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఈ తరగతులను హైదరాబాద్ వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ వై.పద్మసాయి, రిసోర్స్‌పర్సన్ ఎల్‌వి రజనికుమారి, ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ ప్రారంభించారు. కమ్యూనికేషన్ రంగంలో భవిష్యత్ తరాలకు ఉపయోగపడే సిగ్నల్‌ను విశ్లేషణ చేయటం వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, ఈసీఈ విభాగం అధిపతి జి.ఉదయ్‌కిరణ్, భార్గవ్, బీఆర్ ప్రదీప్ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

ఏన్కూరు: ఆశావర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఏర్పుల రాములు డిమాండ్ చేశారు. ఆశావర్కర్ల సమస్యలు పరిష్కారించాలని కోరుతు ప్రభుత్వ వైద్యాధికారి బి.రాములుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 9న ఖమ్మంలో జరిగే కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశావర్కర్స్ జిల్లా కార్యదర్శి బానోత్ అమల, అరుణ, సామ్రాజ్యం, అజ్మీర్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

వైరా: వైఆర్‌జీ లింక్‌వర్కర్స్ స్కీమ్ ఆధ్వర్యంలో మండలంలోని సింగరాయపాలెంలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌పీ శివయ్య మాట్లాడుతూ.. అన్ని రకాల వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. హెచ్ఐవీ, క్షయ వ్యాధుల పట్ల గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి ఆరు నెలలకోసారి దగ్గరలోని పీహెచ్‌సీలో ఉచిత వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. హెచ్ఐవీ అని తెలిసినా భయపడవద్దని తప్పక వైద్య పరీక్షలు చేయించుకుంటూ చికిత్స చేయించుకుంటే జీవితకాలాన్ని పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, అంగన్‌వాడీ టీచర్స్, లింక్‌వర్కర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై..

తల్లాడ: ఎవరైనా ఫోన్ చేసి మీ బ్యాంక్ వివరాలు, ఓటీపీ అడిగితే చెప్పొద్దని తల్లాడ ఎస్సై బి.కొండల్‌రావు పేర్కొన్నారు. తల్లాడలో గురువారం సైబన్ నేరాలపై ఎస్సై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు ఎకౌంట్ల నుంచి డబ్బులు డ్రా చేసుకుంటున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా మోసపోతే 1930 నంబరుకు డయల్ చేయాలన్నారు.

కేంద్ర పథకాలు వివరించాలి



మాట్లాడుతున్న బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

వేంసూరు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రతి ఒక్కరికి వివరించాలని ఖమ్మం జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభకర్ రెడ్డి అన్నారు. పల్లెకు చలో కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని మర్లపాడులో కేంద్ర ప్రభుత్వం పథకాలపై ప్రచారం నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త పార్టీ గెలుపుకు కృషి చేయాలన్నారు. బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ భాస్కర్ల వీరంరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పర్స రాంబాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మట్టా ప్రసాద్, భీమిరెడ్డి బాలకృష్ణరెడ్డి, పాల నాగసురేంద్రరెడ్డి, నవీన్, రాహుల్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో తెలంగాణ రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల ఆధ్వర్యాన గురువారం అసోసియేట్ క్రిస్టియన్ ట్రస్ట్ సహకారంతో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ ప్రారంభించారు. నేత్ర వైద్యులు రిటైర్డ్ ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఆపరేషన్ అవసరమైన వారిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో పి.సువర్ణరాజు, స్టీఫెన్, ఆనందబాబు, సులోచన, రాజేష్, డేవిడ్, ఆర్‌వి కుమార్, గడ్డం శ్రీనివాసరావు, జెఆర్‌సీహెచ్ రాజు, సీహెచ్ దర్గారావు, వల్లభ నాయుడు, వెంకటేశ్వరరావు, ఎల్ఎస్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

లయన్స్‌కంటి ఆస్పత్రిలో ఉచిత ఆపరేషన్లు..

వైరా: లయన్స్ వైరా కంటి వైద్యశాలలో గురువారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీఎం బంజర, నేరడ గ్రామాలకు చెందిన 10 మంది నిరుపేద వృద్ధులకు ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించినట్లు పీడీజీ డాక్టర్ కాపా మురళీ కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు, ఆర్‌సీ లగడపాటి ప్రభాకర్ రావు, ఉండ్రువరలక్ష్మి, కొరకప్పుల దివ్య, లగడపాటి లక్ష్మీరాజ్యం, తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్ రాయ్ రామకృష్ణ, గోపి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో పశువైద్య శిబిరం..

కల్లూరురూరల్: మండలంలోని లక్ష్మీపురంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ముద్దచర్మ వ్యాధి టీకాలు, గర్భాశయ వాపు, చీము చేరడం తదితర రోగాలకు వెటర్నెటీ డాక్టర్ మమత చికిత్స చేశారు. ఈ సందర్భంగా 46 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, అప్పారావు, విజయకుమార్, హనుమంతు, పి.వెంకటేశ్వర్లు, కృష్ణప్రసాద్, రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

తల్లాడ: తల్లాడ-కొత్తగూడెం ప్రధాన రహదారిలో గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారై ప్రమాదాలకు నిలయంగా మారడంతో రోడ్డు పాడై-ప్రమాదాలకు తోడై అనే శీర్షికన సాక్షి దిన పత్రికలో గురువారం వార్త ప్రచరితమైంది. ఈ వార్తకు ఆర్అండ్‌బీ అధికారులు, సిబ్బంది స్పందించారు. గురువారం ఉదయం నుంచి రహదారిలో ఏర్పడ్డ గుంతలకు మరమ్మతులు చేపట్టారు. తల్లాడ మండలం లక్ష్మీనగర్, అన్నారుగూడెం మధ్యలో రోడ్డుకు మరమ్మతులు చేశారు. రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను పూడ్చి వేశారు. గుంటలను పూడ్చి దానిపై బీటీ లేయర్ వేశారు. దీంతో అన్నారుగూడెం పరిసర గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





తల్లాడ-అన్నారుగూడెం మధ్యలో రోడ్డు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

పోడు కేసులు ఎత్తివేయాలి



ప్లాంటేషన్‌ను సందర్శించిన నాయకులు, పోడుసాగుదారులు

కారేపల్లి: పోడు కేసులు ఎత్తివేసి.. లాక్కున్న పోడు భూములకు ప్రత్యామ్నాయంగా పోడు చూపించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. కారేపల్లి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని ఊట్కూరు బీట్ మాణిక్యారం, ఎర్రబోడు ఊటవాగు సమీపంలోని వివాదాస్పద ప్లాంటేషన్‌ను వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా బృందం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంటేషన్ బాధిత పోడు రైతులతో వారు మాట్లాడుతూ.. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడును ఫారెస్ట్ అధికారులు లాక్కొని ప్లాంటేషన్ ఏర్పాటు చేశారని, ఆ సమయంలో ప్రత్యామ్నాయంగా పోడు చూయిస్తామని హామీ ఇచ్చి.. మాట తప్పారన్నారు. ఇప్పుడు ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఫారెస్టు ఉన్నతాధికారులు వివాదస్పద ప్లాంటేషన్ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి బాధిత పోడు దారులకు న్యాయం చేయాలన్నారు. ప్లాంటేషన్‌ను సందర్శించిన వారిలో నాయకులు మెరుగు సత్యనారాయణ, యర్రా శ్రీనివాసరావు, కొండెబోయిన నాగేశ్వరరావు, కె నరేంద్ర, యనమగండ్ల రవి, వజ్జా రామారావు, కరపటి సీతారాములు, కొండయ్య, చల్లా కృష్ణ, కల్తి భద్రయ్య, అరుణ, మల్లమ్మ, వెంకమ్మ, అజ్మీర రమేష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



సమస్యను వివరిస్తున్న స్థానికులు

కొణిజర్ల: మండలంలోని శివారు గిరిజన గ్రామం ఉప్పలచలకకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో ఖమ్మం డిపో నుంచి పల్లె వెలుగు బస్సు మూలగూడెం మీదుగా ఉప్పలచలక, గద్దలగూడెం వరకు నడిపించారు. అధికారులు గత రెండేళ్లుగా బస్సు నిలిపి వేయడంతో గ్రామస్తులు ఎటు వెళ్లాలన్నా ఆటోలే దిక్కయ్యాయి. దీంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రజకుల సంక్షేమానికి కృషి చేస్తా..



మాట్లాడుతున్న నాగభూషణం

సత్తుపల్లిటౌన్: తెలంగాణ ప్రభుత్వం, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిల సహకారంతో పట్టణంలోని రజకుల సంక్షేమానికి కృషి చేస్తానని ఆ సంఘం బాధ్యుడు విరివాడ నాగభూషణం అన్నారు. గురువారం స్థానిక దోబీఘాట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 11న నిర్వహించే పట్టణ రజక సంఘం అధ్యక్ష ఎన్నికల్లో విరివాడ నాగభూషణం, పర్సా సోమయ్య, బెల్లకొండ రాము పోటీలో ఉన్నారు. ఈ నేపథ్యంలో నాగభూషణం మాట్లాడుతూ.. అసంపూర్తిగా మోడ్రన్ దోబీఘాట్ అభివృద్ధికి, మినీ ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి, ప్రహరీ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో ఈలప్రోలు రామ్మూర్తి, పంతంగి నర్సింహారావు, మరికంటి సత్యనారాయణ, బొజ్జా శ్రీనివాసరావు, రాయల కోటేశ్వరరావు, చింతల సత్యనారాయణ, గజ్జెల శ్రీను, పంతంగి వెంకటేశ్వరరావు, ఏసుబాబు పాల్గొన్నారు.

16న కార్మికుల సమ్మె



ముదిగొండ: సమ్మెను జయప్రదం చేయాలని కార్మికుల ప్రదర్శన

మధిరరూరల్/ముదిగొండ: ఈ నెల 16న జరిగే కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం నరసింహారావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దాసోజు లక్ష్మయ్య తెలిపారు. దేశవ్యాప్త సమ్మెలో మధిరరూరల్ మండలంలోని ఆశ కార్యకర్తలు పాల్గొంటున్నట్లు తెలుపుతూ.. గురువారం దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పృధ్వీ నాయక్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. అదే విధంగా ముదిగొండలో భవన నిర్మాణ కార్మికుల అడ్డాలో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేషనల్ హెల్త్ మిషన్‌కి నిధులు కేటాయించాలని, ప్రతి నెలా 10వ తారీకులోపు గౌరవ వేతనం ఇవ్వాలని, పని భారం తగ్గించాలని కోరారు. కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పడకంటి మురళి, వడ్రాణపు మధు, ఆశ కార్యకర్తలు లక్ష్మి, మార్తమ్మ, సమీప, ప్రశాంతి, రజిని, నాగమణి, మడలాధ్యక్షుడు నారోజు ఈశ్వారాచారి, మండల కార్యదర్శి చెట్టబోయిన వెంకటేశ్వర్లు, వీరబాబు, రాజు, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.